జ్వాల
దశ
నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM

సోమవారం
19 01 2026

సంపుటి 1 సంచిక 58

పేజీలు : 04

RNI : TGTEL/25/A4195

: 9652709777
: 9676054777
info@marojanma.com

MARO JANMA
Rehabilitation & De-Addiction Center
For Alcohol Abuse, Drug Addiction,
Betting Gambling Addiction, Psychiatric Diseases.
A-4 Part, S.No: 6, Injapur, Hayathnagar - 501 510.

వచ్చే నెలలో మున్సిపోల్స్!

చరిత్రలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్ వెలుపల మేడారం సమ్మక్క–సారలమ్మ సన్నిధిలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

దశ, మేడారం: రాష్ట్రంలో గడువు పూర్తయిన 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, వాటి పరిధిలోని 2,996 వార్డులు, డివిజన్లకు సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ సమావేశం తీర్మానించింది. చరిత్రలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్ వెలుపల మేడారం సమ్మక్క-సారలమ్మ సన్నిధిలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన మేడారంలో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

కేబినెట్ నిర్ణయాలివీ...

➔ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి డెడికేషన్ కమిషన్ ఇప్పటికే నివేదిక సమర్పించడం, రిజర్వేషన్లు కూడా ఖరారవడం, అలాగే ఫిబ్రవరిలో రంజాన్, శివరాత్రి పండుగలతో పాటు చివరి వారం నుంచి వివిధ స్థాయిల్లో విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో, సాధ్యమైనంత

..మిగతా 4వ పేజీలో ➔

సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

దశ, ములుగు : అతిపెద్ద ఆదివాసీ పండుగ మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర కోసం జరిగిన ఏర్పాట్లను ఆదివారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రివర్గ సహచరులతో కలిసి బస్సులో జంపన్న వాగు సర్కిల్ వరకు ప్రయాణించి, జాతరకు వచ్చే లక్షలాది భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. జాతరకు సంబంధించి పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో సీసీ కెమెరాల అనుసంధానం, డ్రోన్ కెమెరాల వినియోగాన్ని ముఖ్యమంత్రి పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఏఐ (AI) సాంకేతిక పరిజ్ఞానంతో వాటి పనితీరును పోలీసు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి కి వివరించారు. దాదాపు వెయ్యేళ్ల వీరగాథ, జాతి వారసత్వ సంపదకు సంబంధించిన చరిత్రకు అద్దం పట్టేలా రాతి ప్రాకారాలు, శిలాతోరణాలతో రాష్ట్ర ప్రభుత్వం మేడారం వనదేవతల గద్దెల ప్రాంగణ పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి పరిశీలించారు.

మూలవాసులైన కోయ తెగల ఆచార వ్యవహారాలను కట్టుదిట్టంగా ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ప్రాంగణాన్ని ఆసాంతం పరిశీలించారు. దాదాపు 250 కోట్ల రూపాయల వ్యయంతో గత కొంతకాలంగా శరవేగంగా సాగిన పనులను ముఖ్యమంత్రి ఒక్కొక్కటిగా పరిశీలించారు.

కొత్త మొఖాలు చరిష్మా ఫ్యాక్టర్ గెలుపు మిషన్

జిహెచ్ఎంసి ఎన్నికల్లో
పెద్ద అంబర్పేటపై బిఆర్ఎస్ ఫుల్ ఫోకస్
చరిష్మా ఉన్న నాయకుడి కోసం గాలింపు

4లో

ఆ గద్దలను రానివ్వను డిప్యూటీ సీఎం భట్టి ఫైర్

దశ, హైదరాబాద్

సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంలో తన పేరును ప్రస్తావిస్తూ వచ్చిన కథనంపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. ప్రజల ఆస్తులను కాపాడటమే తన లక్ష్యమని, గద్దలను సింగరేణి దరిదాపుల్లోకి రానివ్వనని ఆయన హెచ్చరించారు. మీడియా సంస్థల అంతర్గత పోటీలో తనను లాగవద్దని ఆయన కోరారు.

సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంలో తన పేరును బయటకు తీయటంపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఒక ప్రముఖ మీడియా సంస్థ కథనంపై అత్యంత ఘాటుగా స్పందించారు. సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంలో తన పేరును ప్రస్తావిస్తూ సదరు పత్రికా యజమాని రాసిన కథనాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది ఆస్తులు సంపాదించడానికో, పదవుల కోసమో కాదని, ప్రజల ఆస్తులను కాపాడటమే తన పరమావధి అని ఆయన స్పష్టం చేశారు.

ఇవాళ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సమాజంలోని వనరులను ప్రజలందరికీ సమానంగా పంచాలనే ఆశయంతోనే తాను ప్రజా జీవితంలోకి వచ్చానని తెలిపారు. సింగరేణి అనేది కేవలం ఒక సంస్థ కాదని, అది తెలంగాణ ప్రజల ఆస్తి, రాష్ట్ర ప్రజల ఆత్మ అని ఆయన అభివర్ణించారు. ప్రజలను పీక్కుతింటున్న గద్దల నుంచి ప్రభుత్వ ఆస్తులను రక్షించడానికే తాను ఈ బాధ్యతలో ఉన్నానని చెప్పారు. తాను ఇక్కడ

..మిగతా 4వ పేజీలో ➔

పాముకు కోరల్లోనే విషం.. విపక్షానికి ఒంటి నిండా విషమే

మున్సిపల్ ఎన్నికల్లోనూ డిపాజిట్లు గల్లంతు కావాలి
69 శాతం పంచాయతీల స్ఫూర్తితో పట్టణాల్లోనూ పాగా వేద్దాం
పేదవాడి పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం.. విపక్షాలను నమ్మొద్దు
మద్దులపల్లి వేదికగా రూ. 361.55 కోట్ల అభివృద్ధి పనులకు 'సీఎం రేవంత్' శ్రీకారం

4లో

ఆర్టీసీకి సంక్రాంతి బొనాంజా

ఐదు రోజుల్లోనే రూ. 67.40 కోట్ల ఆదాయం

దశ, హైదరాబాద్: సంక్రాంతి పండుగ సీజన్ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కు కాసుల వర్షం కురిపించింది. ఈ ఏడాది సంక్రాంతి సెలవులకు తోడు డబుల్ వీకెండ్ శని, ఆదివారాలు కలిసి రావడంతో హైదరాబాద్‌లోని ఉద్యోగులు, విద్యార్థులు రికార్డు స్థాయిలో సొంత ఊళ్లకు పయనమయ్యారు. ప్రయాణికుల రద్దీని ముందే పసిగట్టిన ఆర్టీసీ యాజమాన్యం పక్కా ప్రణాళికతో వ్యవహరించడం వల్ల కేవలం ఐదు రోజుల్లోనే సంస్థ గల్లా పెట్టె నిండిపోయింది. అధికారిక లెక్కల ప్రకారం.. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కేవలం ఐదు రోజుల్లోనే టికెట్ విక్రయాల ద్వారా ఆర్టీసీకి ఏకంగా రూ. 67.40 కోట్ల ఆదాయం లభించింది. అంటే సగటున రోజుకు రూ. 13.48 కోట్ల ఆదాయం రావడం గమనార్హం.

సాధారణ రోజులతో పోలిస్తే ఇది అత్యంత ఎక్కువ ఆదాయం. పండుగ రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ ఏకంగా 6,431 ప్రత్యేక బస్సులను నడిపింది. ఈ స్పెషల్ సర్వీసుల వల్లే రోజుకు అదనంగా రూ. 2.70 కోట్ల చొప్పున ఆదాయం సమకూరింది. ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీకి భయపడి, సురక్షితమైన ప్రయాణం కోసం సామాన్య జనం ఆర్టీసీ బస్సులకే జై కొట్టడం సంస్థకు కలిసొచ్చింది. మరోవైపు, పండుగ ముగిసిన తర్వాత ప్రజలు తిరిగి భాగ్యనగరానికి

చేరుకునేందుకు కూడా ఆర్టీసీ భారీ ఏర్పాట్లు చేసింది. నేడు, రేపు కూడా అదే స్థాయిలో ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి, తెలంగాణ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికుల కోసం ప్రధాన జంక్షన్లలో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఎప్పటికప్పుడు బస్సుల లభ్యతను తెలియజేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆర్టీసీకి ఈ సంక్రాంతి తెచ్చిన లాభాలు పెద్ద ఊరటనిచ్చాయి. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ.. జీరో టికెట్ల రీయింబర్స్‌మెంట్, పండుగ రద్దీ వల్ల పెరిగిన పెయిడ్ ప్రయాణికుల సంఖ్య సంస్థకు ఆర్థిక బలాన్ని చేకూర్చింది.

ఏపీ మహిళా కానిస్టేబుల్‌కు సజ్జనార్ సెల్యూట్

దశ, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహిళా కానిస్టేబుల్ మీద హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసలు వర్షం కురిపించారు. ఓ చేతిలో పేగుబంధం.. మరో చేతిలో సమాజ బాధ్యత.. మాతృత్వానికి, కర్తవ్యానికి సెల్యూట్ అంటూ సజ్జనార్ ట్వీట్ చేశారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కాకినాడలోని కెనాల్ రోడ్డులో శనివారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కెనాల్ రోడ్డులో సామర్లకోట వద్ద వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. సామర్లకోట నుంచి కాకినాడకు వస్తున్న ఓ లారీ.. సాంకేతిక సమస్యలో రైల్వే గేటు వద్ద రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సుమారుగా ఐదారు కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయి.. రాకపోకలు స్తంభించిపోయాయి.

అయితే ఈ ట్రాఫిక్ జామ్‌లో రెండు అంబులెన్సులు కూడా చిక్కుకుపోయాయి. ఈ అంబులెన్సులలో రోగులను కాకినాడ ఆస్పత్రికి తరలిస్తున్నారు. అయితే అత్యవసర సమయంలో ట్రాఫిక్ జామ్ కారణంగా.. అంబులెన్సులు రోడ్డు మధ్యలో ఇరుక్కుపోయాయి. అందులోని రోగులు, రోగుల బంధువులు కూడా ఆందోళన చెందుతున్నారు. వీటికి తోడు ఓ వాహనంలో పురిటినొప్పులు పడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. రోడ్డు మధ్యలో వాహనం ఇరుక్కుపోవటం.. మరోవైపు పురిటినొప్పులు అధికం కావటంతో ఆ మహిళ తీవ్రంగా ఇబ్బందులు పడుతోంది. గంట సేపు ఇదే పరిస్థితి.

కాంగ్రెస్‌లో చేరి తప్పు చేశా: ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

దశ, సంగారెడ్డి: కాంగ్రెస్‌లో ఉండటం వల్ల ఎలాంటి లాభం లేదంటూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పటాన్ చెరు జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో తన అనుచరులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పటి పరిస్థితుల దృష్ట్యా తప్పటడుగు వేసి కాంగ్రెస్ పార్టీలో చేరానంటూ వ్యాఖ్యానించారు. మూడు సార్లు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచాను కాబట్టి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉంది. పటాన్ చెరు నియోజకవర్గంలోని 5 మున్సిపాలిటీల్లోని 104 కౌన్సిలర్లను గెలిపించేందుకు విభాగాల వారిగా పని చేద్దామని మహిపాల్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే హాట్ కామెంట్స్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఆ గద్దలను రానివ్వను

మొదటి పేజీ తరువాయి

ఉన్నంత కాలం ఏ ఒక్క గద్దను కూడా సింగరేణి దరిదాపుల్లోకి రానివ్వనని ఆయన హెచ్చరించారు.

సదరు మీడియా సంస్థ రాసిన టెండర్ల ఆరోపణలపై భట్టి విక్రమార్క సాంకేతిక వివరణ ఇచ్చారు. టెండర్లను పిలిచేది సింగరేణి సంస్థ, దాని బోర్డు అని, నిబంధనలను కూడా సంస్థే ఖరారు చేస్తుందని ఇందులో మంత్రి ప్రమేయం ఉండదని ఆయన స్పష్టం చేశారు. గనులు క్లిష్టతరమైన ప్రాంతాల్లో ఉన్నప్పుడు ఫీల్డ్ విజిట్ (క్షేత్రస్థాయి పరిశీలన) నిబంధన విధించడం సర్వసాధారణమని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా ఇవే నిబంధనలను అనుసరిస్తాయని ఆయన గుర్తు చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా కథనాలు రాయడం తగదని హితవు పలికారు.

గత జ్ఞాపకాలను ప్రస్తావిస్తూ.. తాను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిని కావడంతో ఆయన మీద ఉన్న కోపంతోనే ఇప్పుడు తనపై ఇటువంటి అసత్య కథనాలు రాస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. పత్రికా స్వేచ్ఛను అడ్డుపెట్టుకుని ప్రజా ప్రతినిధుల వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చవద్దని ఆయన కోరారు. వ్యక్తుల వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం లేదా ఎవరి గురించి అయినా నీచమైన పనులు చేయించడం వంటి వీక్ క్యారెక్టర్ తనది కాదని అని ఆయన స్పష్టం చేశారు. మీడియా సంస్థల మధ్య ఉన్న అంతర్గత పోటీలోకి తనను లాగొద్దని, నిజానిజాలను ప్రజలే తేలుస్తారని భట్టి విక్రమార్క వెల్లడించారు.

హైవేపై వాహనాల రద్దీ..

దశ, నల్లగొండ: సంక్రాంతి పండుగ ముగిసింది. నగరవాసులు.. ఒక్కొక్కరుగా పల్లెలను వీడుతున్నారు. సిటీ వైపు పరుగు తీశారు. దీంతో, రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. ఈ క్రమంలో హైవేలపై ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు.. పటుచోట్ల ట్రాఫిక్ మళ్లింపులు ఏర్పాటు చేశారు. సంక్రాంతి సెలవులు ముగియడంతో ప్రజలు.. హైదరాబాద్‌కు వస్తున్నారు. దీంతో, జాతీయ రహదారి 65పై హైదరాబాదు వైపు వాహనాలు పరుగులు తీస్తున్నాయి.

కొత్త మొఖాలు చరిష్మా ఫ్యాక్టర్ గెలుపు మిషన్

జిహెచ్ఎంసి ఎన్నికల్లో పెద్ద అంబర్పేటపై బిఆర్ఎస్ ఫుల్ ఫోకస్

దశ, రంగారెడ్డి:

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యంగా హైదరాబాద్ రాజకీయాల్లో కీలకంగా మారిన పెద్ద అంబర్పేట డివిజన్‌తో పాటు కుంట్లూర్ డివిజన్లపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ డివిజన్లలో ఎలాగైనా పట్టు సాధించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో కొత్త వ్యూహాన్ని అమలు చేసేందుకు టిఆర్ఎస్ సిద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సంప్రదాయానికి భిన్నంగా అభ్యర్థుల ఎంపిక

ఇప్పటి వరకు స్థానిక నాయకత్వానికి పెద్దపీట వేసిన టిఆర్ఎస్, ఈసారి మాత్రం ఆ సంప్రదాయానికి భిన్నంగా ఆలోచిస్తోంది. రిజర్వేషన్ ఏ విధంగా వచ్చినా సరే, గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న వ్యక్తినే బరిలోకి దించాలన్నది పార్టీ అధిష్ఠానం ఆలోచనగా తెలుస్తోంది. అవసరమైతే ఎమ్మెల్యే స్థాయి గుర్తింపు ఉన్న నాయకుడిని కూడా కార్పొరేటర్ అభ్యర్థిగా రంగంలోకి దింపేందుకు సిద్ధంగా ఉందన్న ప్రచారం ఊపందుకుంది.

పెద్ద అంబర్పేట్, కుంట్లూర్ డివిజన్లపై ప్రత్యేక ఫోకస్..

జిహెచ్ఎంసి పరిధిలోని పెద్ద అంబర్పేట్, కుంట్లూర్ డివిజన్లు రాజకీయంగా కీలకంగా మారాయి. గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు, ప్రస్తుత స్థానిక పరిస్థితులు, ప్రజల్లో ఉన్న అసంతృప్తి అంశాలను టిఆర్ఎస్ నాయకత్వం సవివరంగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. ఈ డివిజన్లలో గతంలో పనిచేసిన కొందరు నాయకులపై ప్రజల్లో పెద్దగా సానుకూల అభిప్రాయం లేకపోవడం, ఇప్పటికే బరిలో ఉన్న అభ్యర్థులపై వ్యతిరేకత కనిపించడం పార్టీకి ఆందోళన కలిగిస్తున్న అంశంగా మారింది.

ప్రజాభిప్రాయమే కీలక అస్త్రం..

ఎన్నికల్లో విజయం సాధించాలంటే కేవలం పార్టీ గుర్తు, గతంలో చేసిన అభివృద్ధి పనులు సరిపోవని టిఆర్ఎస్ అంచనా వేస్తోంది. ప్రజల్లో నమ్మకం, అందుబాటు, సమస్యలపై పోరాట పటిమ ఉన్న నాయకుడే ఈసారి విజయానికి కీలకమని పార్టీ భావిస్తోంది. అందుకే ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని అభ్యర్థులను ఎంపిక చేయాలన్న దిశగా పార్టీ అడుగులు వేస్తోంది.

300 డివిజన్లలో చరిష్మా ఉన్న నాయకుల వెతుకులాట..

ఈసారి కేవలం స్థానిక నాయకులకే పరిమితం కాకుండా, జిహెచ్ఎంసి పరిధిలోని దాదాపు 300 డివిజన్లలో చరిష్మా, ప్రభావం ఉన్న నాయకులను గుర్తించే పనిలో టిఆర్ఎస్ నిమగ్నమైందని సమాచారం. ప్రజల్లో గుర్తింపు ఉన్నా, స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నా, అవసరమైతే వారిని కీలక డివిజన్లకు మార్చి పోటీ చేయించాలన్న వ్యూహం అమలు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

డబ్బులు, డోర్ టు డోర్... అన్ని అస్త్రాల వినియోగం

గెలుపు కోసం అవసరమైన అన్ని మార్గాలను వినియోగించాలన్న ఆలోచనలో టిఆర్ఎస్ ఉంది. అభ్యర్థి ఖర్చు భరించగలగడం, ఎన్నికల ప్రచారానికి కావలసిన ఆర్థిక వనరులు ఉండడం, డోర్ టు డోర్ ప్రచారంలో చురుకుగా పాల్గొనగల సామర్థ్యం ఉండడం వంటి అంశాలను పార్టీ ప్రాధాన్యంగా చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి డబ్బులు ఖర్చు పెట్టడానికైనా వెనుకాడబోమన్న సంకేతాలు పార్టీ నుంచి వస్తున్నాయి.

జిల్లా నాయకత్వం కీలక పాత్ర

ఈ మొత్తం వ్యూహ రూపకల్పనలో రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ జిల్లా నాయకులు కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. వారి ఆధ్వర్యంలో పార్టీ నాయకత్వం ఇప్పటికే పలుసార్లు అంతర్గత సమావేశాలు నిర్వహించి, డివిజన్ వారీగా బలాబలాలపై సమీక్షలు జరిపినట్లు తెలుస్తోంది. అవసరమైతే చివరి నిమిషంలోనైనా సంచలన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

విపక్షాల్లో కలవరం... రాజకీయ వర్గాల్లో హాట్ చర్చ

పెద్ద అంబర్పేట, కుంట్లూర్ డివిజన్లలో టిఆర్ఎస్ కొత్త మోఖాలు వ్యూహం విపక్ష పార్టీల్లో స్పష్టమైన కలవరాన్ని తీసుకొస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ముఖ్యంగా చరిష్మా ఉన్న నాయకుడిని బరిలోకి దించాలన్న ప్రచారం మొదలైనప్పటి నుంచి ఇతర పార్టీల్లో అంతర్గత చర్చలు ఊపందుకున్నాయి. టిఆర్ఎస్ ఈసారి అభ్యర్థి ఎంపికలో రాజీపడే అవకాశమే లేదన్న సంకేతాలు విపక్షాలను అప్రమత్తం చేస్తున్నాయి. స్థానిక అసంతృప్తిని తమకు అనుకూలంగా మలచుకోవాలని భావించిన విపక్షాలకు, బిఆర్ఎస్ వ్యూహం పెద్ద షాక్‌గా మారుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. డబ్బులు, ప్రచార బలం, జిల్లా నాయకత్వం ఒకే దిశలో పనిచేస్తే ఫలితం ఎలా ఉంటుందో అన్న భయం విపక్షాల్లో స్పష్టంగా కనిపిస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

కొత్త మోఖాలు... గెలుపు కోసం టిఆర్ఎస్ ?

జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఈసారి టిఆర్ఎస్ ఎంచుకున్న మార్గం స్పష్టంగా ఒక సందేశం ఇస్తోంది గెలుపే లక్ష్యం, ఆ గెలుపు కోసం ఏ స్థాయి నిర్ణయానికైనా వెనుకాడేది లేదు. స్థానిక రాజకీయ సమీకరణలు, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని కేవలం మాటలతో ఎదుర్కోలేమని పార్టీ గ్రహించినట్లుగా కనిపిస్తోంది. అందుకే 'కొత్త మోకాలు' తెరపైకి తెచ్చి, చరిష్మా ఫ్యాక్టర్‌ను ప్రధాన ఆయుధంగా మలచాలని ప్రయత్నిస్తోంది. అయితే ఈ వ్యూహం విజయం సాధించాలంటే ఒక షరతు ఉంది – కొత్తగా తెచ్చే నాయకుడు నిజంగా ప్రజల మధ్య నిలబడగలగాలి. కేవలం చరిష్మా, ఆర్థిక బలం సరిపోదు; స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజలతో నిరంతర సంబంధం ఉంటేనే ఈ ప్రయోగం ఫలిస్తుంది.

మొత్తానికి, పెద్ద అంబర్పేటతో పాటు కీలక డివిజన్లలో టిఆర్ఎస్ చేపట్టిన ఈ కొత్త రాజకీయ ప్రయోగం ఎన్నికల ఫలితాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇది గెలుపు మిషన్‌గా మారుతుందా? లేక విపక్షాలకు కొత్త అవకాశాలు తెరుస్తుందా? అన్నది ఓటరు తీర్పుతో తేలనుంది.

భూ వివాదంతో వ్యక్తిపై రాయితో దాడి హత్యాయత్నం

దశ, దౌల్తాబాద్: భూ తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై రాయితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం శౌరీపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... శౌరీపూర్ గ్రామానికి చెందిన తిరుమల రెడ్డి ఆనందరెడ్డి (60)కు అదే గ్రామానికి చెందిన తుమ్మ జోసెఫ్ రెడ్డి, తుమ్మ వినయ్ రెడ్డిలతో భూ విషయమై గత కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆదివారం అకారణంగా ఇద్దరూ కలిసి ఆనందరెడ్డిపై రాయితో దాడి చేశారు.దాడిలో ఆనందరెడ్డి తలకు గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

వచ్చే నెలలో మున్సిపోల్స్!

మొదటి పేజీ తరువాయి

తొందరగా ఎన్నికలు పూర్తి చేయాలని మంత్రిమండలి భావించింది.

➔ జంపన్న వాగులో నిరంతరం నీరు ఉండే విధంగా రామప్ప, లక్నవరం నుంచి గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు సంబంధించి రూ. 143 కోట్లు మంజూరు చేసింది.

➔ ములుగు జిల్లాలో కొత్తగా పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను కేబినెట్ ఆమోదించింది. రామప్ప చెర్వు నుంచి నీటిని లిఫ్ట్ చేసి ములుగు జిల్లాలోని 5 గ్రామాలు, 30 చెర్వులు కుంటలను నింపడంతో పాటు.. 7500 ఎకరాల ఆయకట్టు కు నీటిని అందించనుంది.

➔ మేడారం పుణ్యక్షేత్రం కోసం ఇప్పటికే 19 ఎకరాల భూ సేకరణ పూర్తి కాగా, మరో 20 లేదా 21 ఎకరాల భూమిని సేకరించి భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని మంత్రిమండలి తీర్మానించింది.

➔ 2027 జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను సమగ్ర ప్రణాళికతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించింది. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహక ప్రాంతంలోని పురాతన ప్రసిద్ధ దేవాలయాలను ఒక సర్క్యూట్ కింద ఆలయాల అభివృద్ధి, ఎకోటూరిజం దృష్టితో నివేదిక అందించేందుకు ఒక కన్సల్టెన్సీని నియమించాలని నిర్ణయించారు.

➔ మార్చి 31 నాటికి కన్సల్టెన్సీ అందించే నివేదికపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, మేడారంలో చేపట్టిన తరహాలోనే దేవాలయాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేసి, పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని మంత్రిమండలి తీర్మానించింది.

➔ ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మెట్రో టేకోవర్ అంశంపై సమగ్రంగా చర్చించిన మంత్రిమండలి ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది. ఈలోగా మెట్రో ఫేజ్ 2లో భాగంగా ఏ, బీ విస్తరణలకు సంబంధించిన భూసేకరణను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, అందుకు రూ. 2,787 కోట్లను కేటాయిస్తూ కేబినేట్ ఆమోదముద్ర వేసింది.

➔ హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు సుమారు 9 కి.మీ. మేరకు కొత్త రోడ్డు నిర్మాణానికి కూడా ఆమోదం తెలిపింది.

➔ నల్గొండ జిల్లా మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలో లా కాలేజీ ఏర్పాటు చేయడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

పాముకు కోరల్లోనే విషం.. విపక్షానికి ఒంటి నిండా విషమే: సీఎం రేవంత్

దశ, ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం:

పాముకు కేవలం కోరల్లోనే విషం ఉంటుంది.. కానీ పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకుని అప్పుల పాలు చేసిన ఆ నాయకులకు ఒంటి నిండా విషమే ఉందని వారు చేసిన పాపాలు బయటపడతాయనే భయంతో ప్రజా ప్రభుత్వంపై నిత్యం విషం కక్కుతున్నారని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం మద్దులపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిన ఆయన విపక్షాల తీరును ఎండగట్టారు.

ప్రజా తీర్పుతో చెంప చెళ్లుమంది..

అసెంబ్లీ, పార్లమెంటు, కంటోన్మెంట్ బై ఎలక్షన్లలో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పొంగులేటి గుర్తు చేశారు. "సెమీ ఫైనల్స్ అని కారుకూతలు కూస్తున్న చిచ్చర పిడుగులకు, టిల్లూలకు మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 69 శాతం గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ గెలుచుకోవడం మా ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన రెఫరెండం అని ఇదే జోరు మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగాలన్నారు. ఉమ్మడిజిల్లాలోని ఏడు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో ప్రత్యర్థుల డిపాజిట్లు గల్లంతు చేసి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు.

వృథా జలాలకు అడ్డుకట్ట..సాగుకు భరోసా..

జిల్లా ప్రగతిలో సాగునీటి ప్రాజెక్టులు చారిత్రక మైలురాయిగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. రూ. 162.54 కోట్లతో నిర్మించే మున్నేరుపాలేరు లింక్ కెనాల్ ద్వారా 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని వివరించారు. రూ.108.60 కోట్లతో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, రూ.45.50 కోట్లతో కూసుమంచిలో 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం జిల్లా యువతకు పేదలకు వరమని కొనియాడారు.

కార్యకర్తలే నా బలం..

తమను గెలిపించడానికి అహోరాత్రులు శ్రమించిన కార్యకర్తలను ప్రజాప్రతినిధుల స్థానంలో కూర్చోబెట్టే బాధ్యత తమదేనని మంత్రి భరోసా ఇచ్చారు. "మీ కష్టాన్ని నేను మరువను అని పేదవాడికి భద్రత, భరోసా కల్పించడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో మా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎన్ని అడ్డంకులు వచ్చినా అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల మంత్రులు, ఉమ్మడి ఖమ్మం జిల్లాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.